www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 22 | బుధవారం | 21 - 05 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## బోధన నైపుణ్యాల అభివృద్ధికే ఉపాధ్యాయులకు శిక్షణ

3




### ఛార్జీలపై మెట్రో
## తాజా నిర్ణయం



తొలిఅడుగు, హైదరాబాద్ : మెట్రో ఛార్జీల విషయంలో ఎల్ అండ్ టీ సంస్థ దిగొచ్చింది. ప్రస్తుతం పెంచిన ఛార్జీలలో 10 శాతం రాయితీని ప్రకటిస్తూ ఎల్ అండ్ టీ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 24వ తేదీ నుం చి ఈ రాయితీలు వర్తించనున్నాయని సంస్థ ప్రకటిం చింది. కాగా.. మెట్రో కనీస ఛార్జీలు రూ. 10 నుంచి రూ. 12కు, గరిష్ఠ 2లో..

# ఛీ..ఛీ.. నువ్వు మనిషివేనా

**- జ్యోతి మల్హోత్రాపై నిప్పులు చెరుగుతున్న నెటిజన్లు.. - యాంటి టెర్రర్ ఇన్వెస్టిగేషన్ కు కేసు అప్పగించే అవకాశం..**

**పాకిస్తాన్ హైకమిషన్ మాజీ అధికారి డానిష్‌తో ఆపరేషన్ సిందూర్ గురించి చేసిన చాటింగ్ మల్హోత్రా డిలీట్ చేసినట్లు తెలుస్తోంది. కీలకమైన డిజిటల్ ఆధారాలను తారుమారు చేసే ప్రయత్నం చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి.**




తొలిఅడుగు డెస్క్ : జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ ప్రతికారం తీర్చుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆ సమయంలో జ్యోతి మల్హోత్రా ఆపరేషన్ సిందూర్ గురించిన ప్రతి విషయాన్ని డానిష్‌తో చాటింగ్ ద్వారా షేర్ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా హర్యానాకు చెందిన యూట్యూబర్, ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రా దేశద్రోహం కేసులో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. అయితే, కేసు విచారణలో కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్తాన్ హైకమిషన్ మాజీ అధికారి డానిష్‌తో ఆపరేషన్ సిందూర్ గురించి చేసిన చాటింగ్ మల్హోత్రా డిలీట్ చేసినట్లు తెలుస్తోంది. కీలకమైన డిజిటల్ ఆధారాలను తారుమారు చేసే ప్రయత్నం చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి.జ్యోతి మల్హోత్రా ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ప్రతి విషయాన్ని మినిట్ టూ మినిట్ చాటింగ్ ద్వారా డానిష్‌కు తెలిపేదని, అనంతరం ఆ చాటింగ్ హిస్టరీని తొలగించిందని తెలుస్తోంది. తన మొబైల్ ఫోన్‌లో ఇతర కీలకమైన ఆధారాలను డిలీట్ చేసింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి దేశమంతా ప్రశంసలు కురిపిస్తుంటే, ఆమె మాత్రం ఈ విషయాలను డానిష్‌కు తెలిపేదని తెలుస్తోంది.చాట్‌లలో ఆపరేషన్ సిందూర్ గురించి వివరాలను షేర్ చేసిందని, హిసార్‌లో బ్లాక్‌అవుట్ సమయం గురించి, అలాగే బ్లాక్‌అవుట్ సమయంలో పరిపాలనా కార్యకలాపాల గురించి, అధికారుల నుండి సైరన్‌లు, అధికారిక సందేశాల గురించి డానిష్‌కు ప్రతీదీ తెలియజేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, ఆ చాటింగ్ అంతా తన ఫోన్‌లో డిలీట్ చేసి సాక్ష్యాలు లేకుండా అధికారు లను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించింది. కానీ, అధికారులు ఆమెకున్న రెండు ఫోన్ లను, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని 2లో..

### ఏపీ ఐసెట్
## ఫలితాలు విడుదల




తొలిఅడుగు, అమరావతి : రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ - 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీపీ 2లో..

### భూ భారతి చట్టం..
## రైతుల ఇంటి చుట్టం



తొలిఅడుగు, హైదరాబాద్ : 'భూ భారతి చట్టం.. రైతుల ఇంటి చుట్టం' అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతులు తమ భూ వివాదాల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరగకుండా ఉండేందుకే భూ భారతి చట్టాన్ని తెచ్చామని తెలిపారు. ప్రస్తుతం 2లో..





## లోటుపాట్లు సరిదిద్దుకోండి

తొలిఅడుగు, హైదరాబాద్ : ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో లోటుపాట్లను సరిదిద్దుకోవాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. పథకాల అమల్లో ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు రాకుండా చూసుకోవాలని, పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో 2లో..

### హైదరాబాద్‌లో మయన్మార్
## వాసుల కలకలం




తొలిఅడుగు, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తూ, నకిలీ పత్రాలతో భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందిన మయన్మార్ దేశస్థుల ముఠా గుట్టు రట్టయింది. రాచకొండ ఎస్ఓటీ పోలీసులు మంగళవారం జరిపిన దాడుల్లో మయన్మార్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. వీరు కొన్నేళ్ల క్రితం మయన్మార్ నుంచి అక్రమంగా మన దేశంలోకి ప్రవేశించి, ఇక్కడ తప్పుడు 2లో..



### కైలాస్ యాత్రలో చిక్కుకుపోయిన
## యాత్రికులు

తొలిఅడుగు, న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్ జిల్లాలో భారీగా కొండ చరియలు విరిగిపడ్డాయి. కైలాస్ యాత్ర ప్రధాన మార్గం లో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో వందలాది మంది కైలాస మానసరోవర్ యాత్ర యాత్రికులు అక్కడ 2లో..

### జ్యోతి మల్హోత్రాపై
## ప్రశ్నల వర్షం



**- వెలుగులోకి కీలక విషయాలు**

తొలిఅడుగు, డెస్క్ : గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పాకిస్థానీ ఏజెంట్లతో ఆమె క్రమం 2లో..

### సైనికుల కంటే పోలీసులు
## అప్రమత్తంగా ఉండాలి



తొలిఅడుగు, అమరావతి : దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంతటి అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తారో, రాష్ట్రంలో అంతర్గత భద్రత విషయంలో పోలీసులు కూడా అంతే జాగరూకతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదులకు సున్నితమైన లక్ష్యంగా మారాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు 2లో..

# కైలాస్ యాత్రలో చిక్కుకుపోయిన వందలాది మంది యాత్రికులు

మొదటి పేజీ తరువాయి

తెలిసింది. కొండచరియలు విరిగిపడటంతో ఆ మార్గం పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ఇరువైపులా వందలాది మంది స్థానికులు, యాత్రికులు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుపై పడిన బండరాళ్లను తొలగించి రోడ్డు పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. పర్వత ప్రాంతం కావడంతో సహాయక చర్యలకు సాంకేతికంగా కొన్ని అవాంతరాలు ఎదురవుతున్నాయి. అయితే, విపత్తు నిర్వహణ బృందాలు యాత్రికులను సురక్షితంగా బయటకు తీసుకుని వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

# జ్యోతి మల్హోత్రాపై ప్రశ్నల వర్షం

మొదటి పేజీ తరువాయి

తప్పకుండా సంప్రదింపులు జరిపిందని, వాటిని రహస్యంగా ఉంచేందుకు పలు ఎన్‌క్రిప్ట్ చేసిన ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించినట్లు విచారణలో తేలింది. స్నాప్‌చాట్, టెలిగ్రామ్, వాట్సాప్‌లో కోడ్ ల్యాంగ్వేజ్‌లో మాట్లాడుకున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. తమ కస్టడీలో ఉన్న జ్యోతిపై దర్యాప్తు అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో సంబంధాలు, అంతర్జాతీయ పర్యటనలు, సమాచార బదిలీ గురించి ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో లోతుగా ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. జ్యోతి పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, దుబాయ్ పర్యటనలపై కూడా ఆరాతీస్తున్నారు. ఈ విషయాన్ని హిసార్ ఎస్పీ శశాంక్ కుమార్ సవాన్ వెల్లడించారు. అంతేకాదు పాకిస్థాన్ - ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు వరకు ఆమె సంబంధాలను ఏర్పరచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఢిల్లీలో పాక్ రాయబారి డానిష్‌తో సంబంధాలపై ఆమె బుకాయించినట్లు తెలిసింది. సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో హర్యానాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రా ను అధికారులు శనివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. జ్యోతి.. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది. కమిషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి 2023లో పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు తేలింది. ఈ కేసులో జ్యోతి మల్హోత్రా ట్రావెల్ వ్లాగర్‌తో కలిసి పని చేస్తున్నట్లు గుర్తించారు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడి హర్యానా, పంజాబ్ నుంచి ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మన దేశంలోని కీలక ప్రాంతాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌తో పంచుకున్నట్లు తేలింది. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతి మల్హోత్రాకు సన్నిహిత సంబంధాలున్నట్లు తెలిసింది.

# సైనికుల కంటే పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి

యంత్రాంగాన్ని, పరిపాలన సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తాను లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కోయంబత్తూరు, హైదరాబాద్‌లలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలు తలచుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ఉగ్రవాదుల జాడలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ గారిని లేఖ ద్వారా కోరాను. పాల నా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఉగ్రవాద జాడలున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించాను" అని పవన్ వివరించారు. ముఖ్యంగా వలస వచ్చే వారి విషయంలో సరైన నిఘా ఉంచ డం ద్వారా సంభవించబోయే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, తీర ప్రాంతంలో కూడా నిరంతర పర్యవే క్షణ, నిఘాను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. "గతంలో కాకినాడలో బయట వ్యక్తులు బోట్లలో వచ్చినట్లు కొన్ని వార్తలు వచ్చాయి. తీరంలో కొత్త వ్యక్తుల కదలికలు, వారి కార్యకలా పాలను నిశితంగా గమనించాలి. పోలీసులు అజాగ్రత్తగా ఉండకుండా అంతర్గత భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని ఆయన హితవు పలికారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసులు సంయుక్త ంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రాష్ట్రంలో కొన్ని ఉగ్రవాద జాడలు కనిపిం చినట్లు తెలిసిందని, ఈ పరిణామాల దృష్ట్యా నిఘా వ్యవస్థను మరింత పటిష్ట ం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అంతర్గత భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదల




రాజశేఖర్ విడుదల చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో అకడెమిక్ సెనేట్ హాలులో ఈ ఫలితాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. మే 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఐసెట్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఈ పరీక్షల కీని విడుదల చేసిన విషయం విధితమే.

# ఛార్జీలపై మెట్రో తాజా నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

రూ.60 నుంచి 75కు పెంచుతున్నట్లు హైదరాబాద్ మెట్రో సంస్థ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. గతంతో పోలిస్తే ఛార్జీలు ఎక్కువగా పెరిగిన నేపథ్యంలో ప్రయాణికుల నుంచే కాకుండా ప్రతిపక్షాలు, వామపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కూడా పెరిగిన మెట్రో ఛార్జీల విషయంలో ఆలోచించాలని ఎల్ అండ్ టీ సంస్థను కోరింది. ఈక్రమంలో ఇటీవల పెంచిన మెట్రో ఛార్జీలను యాజమాన్యం సవరించింది. గత మూడు రోజులుగా పెరిగిన ఛార్జీలు అమలులోకి వచ్చాయి. తాజాగా పెరిగిన ఛార్జీల మొత్తంపై పది శాతం రాయితీ ఉంటుందని ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించడంతో.. ప్రయాణికులకు కాస్త ఊరట లభించినట్లైంది. నిత్యం హైదరాబాద్ మెట్రో ద్వారా దాదాపు 5 నుంచి ఐదున్నర లక్షల మంది ప్రయాణికులు వారి వారి గమ్యస్థానాలకు చేరుతూ ఉంటారు. దాంతో పెరిగిన ఛార్జీలు ప్రయాణికులపై అదనపు భారం పడినట్లైంది. ఛార్జీల పెంపుపై ప్రయాణికులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎల్ అండ్ టీ సంస్థ పెరిగిన ఛార్జీలపై పునరాలోచన చేసి.. పెంచిన ఛార్జీలపై పది శాతం రాయితీ ప్రకటించింది. మెట్రో సంస్థ నిర్ణయంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో మొత్తం మూడు కారిడార్‌లో ముఖ్యంగా మియాపూర్ నుంచి ఎల్బీనగర్ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. అటు నాగోల్ నుంచి రాయదుర్గం మార్గంలో కూడా విపరీతంగా రష్ ఉంటుంది. ఈ రెండు మార్గాల్లో లాభాలు ఉన్నప్పటికీ జేబీఎస్, ఎంజీబీఎస్ మార్గం మాత్రం పూర్తిగా నష్టాల బాటలో నడుస్తోంది. ఈ క్రమంలో నష్టాల నుంచి గట్టెక్కేందుకు మాత్రమే ఛార్జీల పెంపు అనివార్యమైందే తప్ప ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం, ప్రయాణికులపై అదనపు భారం వేయడం తమ ఉద్దేశం కాదని మెట్రో సంస్థ ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాలను కూడా పరగిణలోకి తీసుకుని పెరిగిన ఛార్జీలపై దాదాపు పదిశాతం రాయితీ ఇస్తూ ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ నిర్ణయం తీసుకుంది.

# ఛీ..ఛీ.. నువ్వు మనిషివేనా

మొదటి పేజీ తరువాయి

డిలీట్ చేసిన డేటాను తిరిగి పొందడానికి వాటిని ఫోరెన్సిక్ అధికారులకు పంపారు.కేసు దర్యాప్తు ముందుకు సాగుతున్నకొద్దీ ఒక్కొక్కటిగా సంచలన విషయాలు బయట పడుతున్నాయి. పాకిస్తాన్‌లో జ్యోతి కార్యకలాపాలు సాంస్కృతిక లేదా మతపరమైన పర్యాటక రంగానికి మించి ఉన్నాయని విచారణలో తేలింది. ఆమె వీడియోలు మతపరమైన కంటెంట్‌గా ఉన్నప్పటికీ, వీడియోలు మాత్రం మతపరమైన ప్రదేశాల గురించి తక్కువ సమాచారాన్ని ఇస్తున్నాయి. ఎక్కువగా సరిహద్దు ప్రాంతాలు, వాటి భద్రతా ఏర్పాట్లపై జ్యోతి దృష్టి సారించినట్లు వీడియోలలో కనిపిస్తోంది.జ్యోతి.. పాకిస్తాన్ పర్యటన తర్వాత చేసిన బంగ్లాదేశ్, చైనా పర్యటనలకు సంబంధించిన వీడియోలను దర్యాప్తు బృందం అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మే 17, 2014న బైసాఖి పండుగ కోసం జ్యోతి పాకిస్తాన్‌కు వెళ్లింది. ఈ పండుగ పది రోజులు కొనసాగినప్పటికీ, ఆమె 20 రోజులకు పైగా పాకిస్తాన్‌లోనే ఉండి, దాదాపు ఒక నెల పాటు చైనాకు వెళ్లింది. పండుగ తర్వాత ఆమె పాకిస్తాన్‌లో ఎక్కడికి వెళ్లింది? ఎవరిని కలిసింది? ఆమె చైనా పర్యటన అక్కడ ముందే నిర్ణయించబడిందా అని ఏజెన్సీలు దర్యాప్తు చేస్తున్నాయి.ఏది ఏమైనా జ్యోతి మల్హోత్రాపై నెటిజన్లు సోషల్ మీడియాలో నిప్పులు చెరుగుతున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ ప్రతికారం తీర్చుకున్నందుకు ఒక స్త్రీగా సంతోషించాల్సింది పోయి బదులుగా పాకిస్తాన్ అధికారులకు చాటింగ్ లలో అందుకు సంబంధించిన విషయాలు చేరవేయడంతో ఆమెపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఛీ..ఛీ..నువ్వు ఆడదానివేనా నీలాంటి వారి వల్లే మన దేశంలో భద్రత అనేది లేకుండా పోయిందని ఫైర్ అవుతున్నారు.

# హైదరాబాద్‌లో మయన్మార్ వాసుల కలకలం

మొదటి పేజీ తరువాయి

ధృవపత్రాలు సృష్టించి ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో మదర్సాలో పనిచేసే కొందరు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తేలింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, మయన్మార్‌కు చెందిన మహ్మద్ అమీన్, ఆయన భార్య మహ్మద్ రుమానా అక్తర్, వారి కుమారుడు మహ్మద్ నయీమ్ 2011 సంవత్సరంలో అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. అనంతరం 2014లో హైదరాబాద్ నగరానికి చేరుకుని, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్నారు. మహ్మద్ అమీన్ స్థానికంగా ఓ బ్యాటరీ దుకాణాన్ని నడుపుతున్నాడు.

వారు అక్రమంగా ఆధార్ కార్డులు పొందిన వైనంపై పోలీసులు దృష్టి సారించారు. మదర్సాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మహ్మద్ హారీస్, అయాజ్‌ల సహాయంతో మహ్మద్ అమీన్ మంచాల గ్రామంలోని మీ-సేవా కేంద్రం ద్వారా ఆధార్ కార్డు సంపాదించినట్లు విచారణలో తేలింది. ఆ తర్వాత, నకిలీ వివాహ ధృవపత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా తన భార్య రుమానా అక్తర్‌కు కూడా ఆధార్ కార్డు ఇప్పించాడు. ఇక వీరి కుమారుడైన నయీమ్‌కు, మయన్మార్ నుంచే అక్రమంగా వచ్చి బాలాపూర్‌లో స్థిరపడిన షోయబ్ మాలిక్ అనే వ్యక్తి నకిలీ పత్రాలతో ఆధార్ కార్డు వచ్చేలా చేశాడు. ఈ కుటుంబం తప్పుడు పత్రాలను సమర్పించి ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందిన వ్యవహారంపై పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన రాచకొండ ఎస్ఓటీ పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ ఆధార్ కార్డులతో పాటు, వాటి ఆధారంగా పొందిన పాన్ కార్డులు, గ్యాస్ బుక్‌లు, బ్యాంకు ఖాతాలు, పాస్‌బుక్‌లు వంటి ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరికి సహకరించిన అయాజ్, షోయబ్ మాలిక్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు వివరించారు.

# లోటుపాట్లు సరిదిద్దుకోండి

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కొద్దిరోజుల కిందట జరిగిన సీఎల్పీ సమావేశంలో.. పార్టీ ఎమ్మెల్యేలతో తాను ముఖాముఖిగా భేటీ అవుతానని, ఈలోగా తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యల జాబితాను రూపొందించుకోవాలని సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశమై.. వారికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్, మెదక్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఈ సమాశంలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మైనంపల్లి రోహిత్, శ్రీగణేశ్ పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం.. రైతుల ఇంటి చుట్టం

పెండింగ్‌లో ఉన్న జటిలమైన భూ సమస్యలను ఈ చట్టం ద్వారా వచ్చే ఆగస్టు 15లోపు పరిష్కరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికా రులే రైతుల ఇళ్ల వద్దకు వచ్చి వారికి దరఖాస్తు ఫారం అందజేస్తారని పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఘనపూర్ గ్రామాల్లో, మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో మంత్రి పొంగులేటి పాల్గొ న్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పలుచోట్ల నెలకొన్న ప్రభుత్వ, అటవీ, ప్రైవేటు భూముల గట్టు పంచాయితీలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో ఇందిరాగా ంధీ ప్రధానిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, ఆ భూము లను సాగు చేసుకుంటున్న వారసుల్లో అర్హులకు సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఎలిగేడు మండలంలో వచ్చిన 1054 భూ సమస్య దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరిం చామని, మిగతా వాటిని జూన్ 2 లోపు పరిష్కరి స్తామని అన్నారు. 2020లో నాటి సర్కారు తెచ్చిన ధరణి చట్టంలో సాదా బైనామాలకు పరిష్కారం చూపకుండానే 9.20 లక్షల దరఖాస్తులను స్వీకరిం చారని, ఈ అంశం ప్రస్తుతం కోర్టుల్లో ఉందని చెప్పారు. ఆధార్ లాగా, భూములకు భూధార్ కార్డు ఇస్తామని, ఈ నంబర్‌తో ఆన్‌లైన్‌లో రైతులు తమ భూముల వివరాలు చూసుకోవచ్చని మంత్రి పొంగు లేటి అన్నారు. సర్వే చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసి ఆ మ్యాపులను పాస్ బుక్‌లో జోడిస్తామన్నారు. ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసి, వారికి మూడు నెలల శిక్షణ ఇస్తామని, ప్రతి మండలానికి 8 మందికి తగ్గకుండా నియమిస్తామని చెప్పారు. ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తికమక అవుతూ సర్కారును బదనాం చేయాలని చూస్తున్నా ని ఆరోపించారు. అంతకుముందు హుస్నాబాద్ మినీ స్టేడియంలోని హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన సందర్భంగా మంత్రి రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 నుంచి అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి చట్టం అమలుకు తహసీల్దార్ స్థాయి సదస్సులు జరుగుతాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ నెలాఖరులోపు మొదటి దశలో 4.50 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

# బాలుడి అదృశ్యం



తొలిఅడుగు / బొల్లారం : బాలుడు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొల్లారంలో నివాసం ఉండే ఆ బాలుడు సోమవారం నుంచి కన్పించడం లేదని తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం అందాజ 12:30 గంటల సమయంలో చర్చి బస్తి బొల్లారంలో ఉండే గోపాల్ జెన తండ్రి సురేంద్ర జెన, వయస్సు: 14 సం. లు, వృ: 7వ తరగతి చదువుతున్న విద్యార్థి, షాప్ కి వెళ్ళి వస్తానని ఇంటి నుండి బయలుదేరి తిరిగి రాలేదని తెలిపారు. చుట్టుపక్కల వెతికినా అతని ఆచూకీ తెలియలేదని తన తండ్రి సురేంద్ర జెన పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించనట్లు పోలీసులు తెలిపారు. పిర్యాదుదారుడు తన భార్య పిల్లలతో ఒరిస్సా రాష్ట్రం నుండి వలస వచ్చి, బొల్లారం లో ఓ కంపెనీ లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వాళ్ళు బొల్లారం పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలన్నారు. అలాగే 8712656729,8712661841 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# బోధన నైపుణ్యాల అభివృద్ధికే ఉపాధ్యాయులకు శిక్షణ

– ప్రభాకర్, మండల విద్యాధికారి ఉపాధ్యాయుల్లో బోధనా




తొలిఅడుగు, ధర్మారం, మే 20 : నైపుణ్యాలను పెంపొందించుటకే ఐదు రోజులపాటు ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మారం మండల విద్యాధికారి, కోర్స్ డైరెక్టర్ పోతు ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వంద మంది ఉపాధ్యాయులకు మంగళవారం నుండి శనివారం వరకు ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి శిక్షణ ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాని కి నిర్వహణలో మండలంలోని ఎనిమిది మంది రిసోర్స్ పర్సన్లు తమ సేవలను అందిస్తున్నారన్నారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయు ల్లో నెలకొని ఉన్న సామర్థ్యాలను పెంపొందించుటకు, వివిధ అంశాల్లో నైపుణ్యం అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. శిక్షణలో భాగంగా ముఖ్యంగా బోధనా పద్ధతుల్లో నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల్లో చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియల్లో ఎంచుకోవాల్సిన వ్యూహాలు,బోధనలో టెక్నాలజీ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించుకోవడం, ప్రభావవంతంగా పరీక్షల నిర్వహణ, ఫలితాల విశ్లేషణ, విద్యార్థులకు మరియు పాఠశాలలకు లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధన కొరకు నిరంతరం శ్రమించడం, పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం వహించేలా చేయడం, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల సర్వతోముఖ వికాసానికి ఉపాధ్యాయులను సంసిద్ధం చేయటం వంటి అనేక అంశాలలో రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పెద్దపెల్లి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎఫ్ ఎల్ ఎన్ ఛాంపియన్ షిప్ పోటీలో ధర్మారం మండలం నుండి పన్నెండు పాఠశాలలు ఎంపికై జిల్లా కలెక్టర్ గారిచే ప్రశంసలు పొందడం, జిల్లాలో మొదటి స్థానాన్ని సాధించడం మనకు గర్వకారణం అన్నారు. ఛాంపియన్ షిప్ సాధించిన పాఠశాలల ఉపాధ్యాయ బృందాలను ఈ సందర్భంగా మండల విద్యాధికారి అభినందించారు. ఇదే ఉత్సాహంతో రాబోవు విద్యా సంవత్సరంలో సైతం ఉపాధ్యాయులంతా శ్రమించి ధర్మారం మండలాన్ని విద్యా విభాగంలో అగ్రస్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు జాడి శ్రీనివాస్, గుర్రాల గంగారెడ్డి, ఈగం సంతోష్ కుమార్, హైమావతి, గంకిడి వెంకట రమణారెడ్డి, సిరిపురం సునీల్, ఆడిచర్ల సతీష్, బి. జలపతి,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంతోషం మల్లారెడ్డి, నూతి మల్లన్న, మోతిలాల్ నాయక్, రాములు, స్వామి నాయక్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వీఎం ఆస్పత్రిలో... అరుదైన చికిత్స విజయవంతం

– అన్నవాహిక నుండి త్రిభుజాకారంలో ఉన్న ఎముక తొలగింపు

– వివరాలు వెల్లడించిన ఆసుపత్రి సీఈఓ దేవరకొండ శ్రీనివాస రావు




తొలిఅడుగు, గజ్వేల్, మే 20 : సిద్దిపేట జిల్లా, ములుగు మండలం, లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆర్వీఎం ఆసుపత్రి, మెడికల్ కళాశాల సీఈవో దేవరకొండ శ్రీనివాసరావు మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గజ్వేల్ నియోజకవర్గం, ఇటిక్యాల గ్రామానికి చెందిన తాడూరి యాదగిరి(65) గత మంగళవారం ఓ శుభకార్యంలో పాల్గొనగా, ఆ విందులో ఆహారం భుజించే సమయంలో అనుకోకుండా త్రిభుజాకారంలో ఉన్న ఎముక మింగేశాడు. ఈ క్రమంలో ఆ ఎముక గొంతు ద్వారా అన్నవాహిక వద్దకు వెళ్లి నిలిచిపోయింది. దీంతో ఆయన శ్వాసపరమైన ఇబ్బందులు ఎదుర్కోవడం, ఆహార సమస్య తలెత్తడం, కడుపునొప్పి తీవ్రమవడం తదితర సమస్యలు ఉత్పన్నమవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆర్వీఎం ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. వెంటనే స్పందించిన సంబంధిత విభాగం హెచ్ఓడి డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ గ్యాస్ట్రో ఎ%శీ%టరాలజిస్ట్ డాక్టర్ అభిషేక్, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ వరుణ్, డాక్టర్ భావన, డాక్టర్ శ్రీనివాస్ బృందం రోగి యాదగిరికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అన్నవాహిక చివరలో త్రిభుజాకారంలో ఉన్న ఎముక ఉన్నట్లు గుర్తించారు. రోగి యాదగిరి అత్యవసర పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సమస్య పరిష్కారానికి అధునాతనమైన వైద్యం గ్యాస్ట్రోస్కోపీ లో నూతన సాంకేతికతను వినియోగించి ఓవిఎస్కో చికిత్స ద్వారా వైద్యుల బృందం సురక్షితంగా ఎముకను తొలగించింది. సమర్థవంతం గా ఆపరేషన్ పూర్తి కావడం, రోగికి తక్షణ నొప్పి నివారించడం తో సులభంగా ఆహారం తీసుకోవడం జరుగుతుంది. ఆపరేషన్ విజయవంతం కావడంతో ఆసుపత్రి యాజమాన్యానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అయితే తమ ఆసుపత్రిలో అపార అనుభవం, నిష్ణాతులైన వైద్యులచే ఎన్నో క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ యాకయ్య, సీఈవో దేవరకొండ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ముఖ్యంగా రోగి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించగా, లాభాపేక్షతో కాకుండా సేవాభావానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రూ 15 లక్షల ఖర్చు అయ్యే ఈ ఆపరేషన్ ఉచితంగా నిర్వహించినట్లు వారు వివరించారు.

# జనగామలో విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం



తొలిఅడుగు, జనగామ, మే 20 : జనగామ పట్టణంలో జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ ఆధ్వర్యంలో 14 వార్డ్ అంబేద్కర్ నగర్ లో, మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతంగా జరిగిందిలి ఈ శిబిరాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ రోజు శిబిరానికి హాజరైన వారిలో ఇంకా స్కాన్లు, ఎక్స్‌రేలు, కంటి శస్త్రచికిత్సలు, ఎముకల సంబంధిత శస్త్రచికిత్సలు అవసరమైనవారిని రేపు మల్లారెడ్డి మల్టీ స్పెషలిటీ హాస్పిటల్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు ద్వారా తీసుకెళ్లనున్నాము. కావున అవసరమున్న వారు రేపు ఆసుపత్రికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరుతున్నాము. ఈ సందర్భంగా దూసరి ధనలక్ష్మి మాట్లాడుతూ%ొ% అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించిన సందర్భంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి చే పొందిన ప్రేరణ వల్లే ఈ సేవా కార్యక్రమాలు ప్రారంభించాలన్న తపన కలిగిందని తెలిపారు. ఇప్పటికైనా ఈ సేవా యాత్రలో భాగస్వాములు కావాలనుకునే ప్రతి ఒక్కరినీ ఆసుపత్రికి వెళ్లాలని కోరుతున్నాము. అలాగే, ఈ రోజు శిబిరంలో పాల్గొన్న 10 మంది ప్రత్యేక వైద్యులను జీవిత గ్రీన్ హెూప్ సొసైటీ తరపున శాలువాతో సత్కరించడం జరిగింది. సామాజిక సేవల ద్వారా సమాజానికి ఏదో చేయాలని, పేదవారికి సహాయం చేయాలన్న లక్ష్యంతో జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ పని చేస్తోంది. ఎవరైనా పేదవారికి సహాయం చేయాలనుకుంటే, మా ద్వారా మద్దతు ఇవ్వవచ్చని తెలిపారు.

# జూన్ 1న ప్రజాకవి జి.వై.గిరి వర్దంతి పురస్కరించుకొని జిల్లాస్థాయి అభ్యుదయ సామాజిక చైతన్య గీతాల పోటీలు



తొలిఅడుగు, జనగామ, మే 20: ప్రజాకవి జి.వై.గిరి 21వ వర్ధంతి పురస్కరించుకొని జూన్ 1వ తేదీన అభ్యుదయ సామాజిక చైతన్య గీతాల పోటీలు జనగామ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు, జి.వై.గిరి ఫౌండేషన్ చైర్మన్ జి కృష్ణ అన్నారు. మంగళవారం జనగామలో ఐక్యవేదిక వర్కింగ్ కమిటీ సభ్యుల సమావేశం పొట్టబత్తిని భాస్కర్ అధ్యక్షత జరుగగా ఆయన మాట్లాడారు. ఆదివారం నాడు మద్యాహ్నం 3 గంటలకు గబ్బెట గోపాల్ రెడ్డి భవన్, సిపిఐ కార్యాలయంలో పోటీలు నిర్వహిస్తామన్నారు.అభ్యుదయ, సామాజిక చైతన్య గీతాలు ప్రైవేటు సినిమా పాటలు పాడవచ్చునని అన్నారు. కవులు కళాకారుల ఐక్యవేదిక బాధ్యులు అయిలా సోమనర్సింహచారి 98484 80442, పెట్లోజు సోమేశ్వరాచారి 99489 89778, చిలుమోజు సాయికిరణ్ 70360 84313 ముగ్గురులో ఏ ఒక్కరికైనా పోన్ గాని వాట్సప్ ద్వారా గాని ఈనెల 30 తేది లోపు ఆసక్తి కలిగిన గాయనీ గాయకులు పేర్లు నమోదు చేసుకోవచ్చునని అన్నారు. పోటీల్లో పాల్గొనే గాయని గాయకులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని, గెలుపొందిన విజేతలకు ప్రముఖుల చేతుల మీదగా బహుమతి ప్రధానం చేస్తామని, అలాగే ప్రజాకవి జి.వై. గిరి జీవిత సాఫల్య పురస్కారం కళలు,సాహిత్యం, స్వచ్ఛంద సేవారంగాల్లోని ముగ్గురుని ఎంపిక చేసి అందజేస్తామని జి.కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ సభ్యులు లగిశెట్టి ప్రభాకర్, అయిలా సోమనర్సింహచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, గడ్డం మనోజ్ కుమార్, చిలుమోజు సాయికిరణ్, డాక్టర్ వేముల సదానందం, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, రంగరాజు ప్రసాద్,గొలుసుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## వృద్దులకు మహా అన్నదానం




తొలిఅడుగు, జనగామ, మే 20 : జనగామ పట్టణానికి చెందిన డాక్టర్ అలిసేరి శృతి 31వ జయంతి సందర్భంగా వారి తల్లితండ్రులు శ్రీనివాస్ భాగ్యలక్ష్మి,చెల్లెలు శ్రావ్య,తమ్ముడు ఉదయ్,విజయ మెడికల్ హాల్ రవళి నర్సింగ్ హెూమ్ స్థానిక జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్దులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి తన కూతురిని స్మరించుకోవడం జరిగింది జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్ మరియు ముఖ్య సలహా దారులు వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ ఈ రోజు శృతి జయంతి సందర్భం గా వారిని స్మరించుకుని అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యం లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన వారి కుటుంబ సభ్యులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ,ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు మరియు పెళ్లిరోజు సందర్భంగా వృదా ఖర్చు చేయ కుండా పది మంది పేద వారి ఆకలి తీర్చి వేడుకలు జరుపుకోవాలి అని తెలియజేయడం జరిగింది..ఈ కార్యక్రమం లో పాల్గొన్న టీమ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ టీమ్ సభ్యులు సల్ల మహేష్, మద్దెల కార్తిక్, మహమ్మద్ ఆఫ్రొజ్, మహమ్మద్ యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట పరిసర ప్రాంతాలను పరిశీలించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటేల్








తొలిఅడుగు, మణుగూరు, మే 20 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల మున్సిపాలిటీ పరిధిలోని మణుగూరు రాజుపేట గ్రామంలో పలు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం గారు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటేల్ గారు అనంతరం రాజుపేట, విట్టల్ రావు నగర్ లో ఉన్న చెరువుని మరియు సింగరేణి బ్లాస్టింగ్ వలన క్రాక్ చెందిన పలు ఇళ్లను పరిశీలించారు అనంతరం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే గారికి కలెక్టర్ గారికి సింగరేణి బొగ్గు టిప్పర్ల వలన, ఇసుక టిప్పర్ల వలన, సింగరేణి డంపింగ్ నుంచి వచ్చే డస్ట్ వలన గ్రామస్తులు పడుతున్న పలు ఇబ్బందులను ఎమ్మెల్యే మరియు కలెక్టర్ గారి దృష్టికి తీసుకురాగా తక్షణమే సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామని పినపాక ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు గారు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటెల్ గారు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సింగరేణి అధికారులు,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య గారు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్ గారు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి గారు, టౌన్



అధ్యక్షులు శివ సైదులు గారు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు యువజన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుని బరిలో బిసాడి వంశీ

తొలిఅడుగు, హుజురాబాద్, మే 20 : జమ్మికుంట పట్టణలో జరిగిన కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల స్థాయి సమావేశంలో జరిగినటువంటి జమ్మికుంట పట్టణ మండల అధ్యక్షుల దరఖాస్తుల స్వీకరణలో భాగంగా బీసాడి వంశీ కృష్ణ ఈ సమావేశానికి వచ్చినటువంటి టీపీసీసీ పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్ కు మరియు రఘునాథ్ రెడ్డి కి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ కు దరఖాస్తుని అందించడం జరిగింది.ప్రస్తుత ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడిగా ఉన్నటువంటి బీసాడి వంశీ కృష్ణ జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుని బరిలో ఉన్నట్లుగా ఒక ప్రకటనలో తెలిపారు ఎన్ఎస్ యుఐ కార్యకర్తగా మొదలైన ప్రస్థానం ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు విద్యార్థుల పక్షాన ఎన్నో పోరాటాలు ఎన్ని సేవ కార్యక్రమాలు చేసినటువంటి వంశీ



ప్రస్తుతం జమ్మికుంట పట్టణంలో ఉన్నటువంటీ అన్ని వార్డుల్లో ఉన్న నాయకులను కార్యకర్తలను కలుపుకొని రానున్నరోజుల్లో పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని వారు అన్నారు.

## పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల కార్యకర్తలు సమావేశం

తొలిఅడుగు, మణుగూరు, మే 20 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల కేంద్రంలో ఏఐసిసి,టీపీసీసీ ఆదేశాల మేరకు మణుగూరు కిన్నెర కళ్యాణ మండపంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోదెం వీరయ్య. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గెలిపించిన కార్యకర్తలను నాయకులను ప్రజలను గెలిపించడమే మా లక్ష్యం అని రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంది కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయదు ఈ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ పై మరియు పినపాక నియోజకవర్గం లో ఉన్న ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల పదవులపై సమీక్ష నిర్వహించారు కాంగ్రెస్ పార్టీలో పది సంవత్సరాలుగా జండా మోసిన కార్యకర్తలకు నాయకులకు మాత్రమే పదవులు దక్కుతాయని పార్టీ అధిష్టానం తెలియజేశారు అనంతరం మండల అధ్యక్షులుగా టౌన్ అధ్యక్షులుగా మహిళా అధ్యక్షులుగా పోటీపడిన ఆశావాదుల నుండి నమూనా పత్రాలను స్వీకరించారు. ఇచ్చిన పత్రాలను



- ముఖ్య అతిథిగా హాజరైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గాంధీభవన్ లో పరిశీలించి వారి యొక్క నాయకత్వంపై పూర్తి నివేదిక స్వీకరించి తదుపరి కాంగ్రెస్ పార్టీ ద్వారా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను నియమిస్తామని తెలియజేశారు.ఈ యొక్క కార్యక్రమానికి పినపాక నియోజకవర్గంలో మణుగూరు అశ్వాపురం బూర్గంపాడు గుండాల ఆళ్లపల్లి, కరకగూడెం,పినపాక, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకోవడానికే ప్రభుత్వం పై ఆరోపణలు



తొలిఅడుగు, గజ్వేల్, మే 20 : బిఆర్ఎస్ నాయకులు ఉనికి కాపాడుకోవడానికి ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం తగదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ ఏఎం సి సమావేశ మందిరంలో వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు బాగుంటేనే అందరూ బాగుంటారు అని నమ్మి రైతు పండించిన ప్రతి వడ్లగింజను సీఎం రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్కార్ కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయడంతో పాటు రైతు ఖాతాల్లోకి డబ్బులు కూడా వేగంగా జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు లాభం చేకూర్చే ఉద్దేశ్యం ఉంటే చక్కని సలహాలు ఇవ్వాలని, అంతేగాని గతంలో కన్నా వేగంగా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను తప్పు పట్టడం సరికాదన్నారు. వడగళ్ల వాన పలుచోట్ల కురిసిన సందర్భాల్లో ఆలస్యం జరిగిందే తప్ప మిగతా అన్ని ప్రాంతాల్లో పటిష్టంగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయన్నారు. రైతులను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి ప్రయత్నించడం ప్రతాపరెడ్డికి తగదన్నారు. గజ్వేల్ మండలంలో ఐకేపి ద్వారా 8 కొనుగోలు కేంద్రాలలో 1202 నంది రైతుల నుండి 53,340 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, 660 మంది రైతులకు రూ. 7. 07 కోట్ల డబ్బులను చెల్లించడం జరిగిందన్నారు. పిఏసిఎస్ ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు 10 కేంద్రాల్లో ఇప్పటివరకు 610 మంది రైతుల నుండి, 32,662 క్వింటాల ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు రైతులందరికీ రూ. 7.57 కోట్ల మొత్తాన్ని చెల్లించినట్టు తెలిపారు. ఇదే విధంగా అన్ని మండలాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రతాప్ రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకొని రైతులకు మేలు చేయడానికి ప్రభుత్వానికి సూచనలు చేయాలన్నారు. సమావేశంలో ఏం సి డైరెక్టర్లు కర్ణాకర్ రెడ్డి, నర్స గౌడ్, యాదగిరి, ఏఎం సి కార్యదర్శి జాన్ వెస్లీ, ఏపిఎం దుర్గాప్రసాద్, పిఏసిఎస్ సిబ్బంది బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, అరుణ్ అజ్గర్, దప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

సాహిత్య సామ్రాజ్ఞి సులోచనారాణి

యద్దనపూడి సులోచనారాణి. తెలుగు ప్రజలకు పరిచయం అవసరం లేని పేరు. దశాబ్దాల పాటు తెలుగు నవలా పాఠకులకు, తెలుగు సినిమా ప్రేక్షకులకు అభిమాన రచయిత్రి.తెలుగు నవలా సామ్రాజ్యాన్ని ఐదు దశాబ్దాల పాటు ఏలిన సాహిత్య సామ్రాజ్ఞి. ఆమె నవలల్లో సహజత్వం ఉట్టి పడుతుంది. ఆమె పాత్రలలో సజీవత్వం తొణికిస లాడుతుంది. పెళ్ళికాని యువతలో, గృహిణుల్లోనూ పాఠక శక్తిని పెంపొందించిన ఘనత ఆమెకే దక్కింది. మధ్యతరగతి కుటుంబ పరిస్థితులే ఆమె పాత్రల నేపధ్యం కాగా, యువతీ యువకుల నుండి వయసు మళ్లిన వారి వరకు ఆమె అభిమాన రచయిత్రిగా మారారు. ఆధునిక జీవనశైలి కి భిన్నమైన, చర్విత చర్వణంగా దినచర్యలు కలిగిన నాటి పరిస్థితులలో రేడియో కార్యక్రమాలు వినడం, నవలలు చదవడం, అప్పుడప్పుడూ సినిమాలు చూడడం సర్వత్రా చోటు చేసుకున్న కాలంలో యద్దనపూడి నవలలు వయసు తో నిమిత్తం లేకుండా నిత్య పఠనాసక్తిని కలిగించాయి అంటే ఆమె రచనా వ్యాసంగం ఎంతటి ప్రభావాన్ని పాఠక లోకంపై చూపిందో స్పష్టం అవుతున్నది. చర్విత చర్వణం లా సాగే నాటి ప్రజా జీవన విధానాన్ని జాగ్రత్తగా గమనించి, తను పరిశీంచిన జీవితాలను కథా వస్తువులుగా తీసుకొని, పాఠకులకు నచ్చిన రీతిలో ఆమె రచనలు చేశారు. మధ్యతరగతి అమ్మాయిల ఊహలు, అంతరంగానికి, ఆశలకు, స్వాభిమానానికి యద్దనపూడి నవలలు అద్దంపడతాయని నాటి పాఠకులు భావించేవారు. అమ్మాయిల ఆత్మాభిమానం, తల వంచని వ్యక్తిత్వం, ఆత్మ విశ్వాసం, హుందాతనం, మాటకారితనం ప్రతి ఆడ పాత్రలో కనిపిస్తాయి. ప్రతివారి హృదయాలకు హత్తుకునేలా పాత్రల సృష్టి చేశారు. ఆలుమగల మధ్య ప్రేమలు, కుటుంబ కథనాలు రాయడంలో తనకు వేరెవరూ సాటిరారని నిరూపించారు. అందుకే ఆమె రాసిన నవలల ఆధారంగా అనేక సినిమాలు తీసినా అవి నేటికీ అద్భుత చిత్రాలుగా మన గలుగు తున్నాయి. అలాగే ఆమె రచనలు కేవలం సినిమాలు గానే కాక అనేక టీ.వీ. ధారా వాహికలుగా రూపొందించ బడ్డాయి.

1940లో ఏప్రిల్ 2న కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కాజా గ్రామంలో జన్మించిన యద్దనపూడి సులోచనారాణి తొలిసారిగా చదువుకున్న అమ్మాయిలు చిత్రం ద్వారా సినీ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. 1965లో మనుషులు – మమతలు సినిమాకు కథను అందించారు. తర్వాత వీరు రాసిన మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమ లేఖలు, విచిత్ర బంధం, బంగారు కలలు లాంటి నవలలు చలన చిత్రాలుగా వచ్చాయి. అయితే సెక్రటరీ మాత్రం ఓ అద్భుత ట్రెండ్ సెట్టర్ గా మిగిలి పోయింది. ఆ రోజుల్లో ప్రతి యువకుడు ఓ రాజశేఖరంలా ప్రతి యువతీ ఆత్మాభిమానం గల జయంతిలా ఉండాలనుకునే వారు. 1965 లో మార్కెట్ లోకి వచ్చి సంచలనం సృష్టించింది సెక్రెటరీ నవల. 20 వ శతాబ్దపు బెస్ట్ సెల్లర్ ఏకంగా 75 ముద్రణలు చేసుకున్న నవల ఇది. సీరియల్స్ గా వచ్చినపుడు పాఠకులను మంత్ర ముగ్ధులను చేసేవి కొన్ని నవలలు. సెక్రటరీ, జీవన తరంగాలు, మీన్నా, విజేత, ఆరాధన, కీర్తి కిరీటాలు, ప్రేమ లేఖలు, గిరిజా కల్యాణం, పార్థు, ఈ తరం కథ, ఆత్మీయులు, బంగారు కలలు, కథల్లో బహుమతి, ఐలవ్ యూ... ఇంకా ఎన్నో ఆమె అభిమానులు మెచ్చినవి. ఎన్ని సార్లు ప్రచురించినా, అన్ని ప్రతులూ అతి వేగంగా అమ్ముడు పోయేవి. సులోచనా రాణి శైలి అమోఘం, అనన్యం, అపూర్వం, అనితర సాధ్యం.

మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమలేఖలు, బంగారు కలలు, విచిత్ర బంధం, జై జవాన్, ఆత్మ గౌరవం తదితర నవలలను సినిమాలుగా తీశారు. యద్దనపూడి సులోచనారాణి వయస్సు మళ్లిన ఒంటరి మహిళల కోసం 'విన్' పేరుతో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. దాదాపు ఏడేళ్ల పాటు ఆశ్రమాన్ని నిర్వహించారు కూడా. అనారోగ్య సమస్యలు తలెత్తడం వల్ల తన ఆత్మీయులకు హోం బాధ్యతను అప్పగించారు. అనాథ బాలలు, మురికివాడల్లోని పిల్లల కోసం తన ఇంటి ఆవరణ లోనే కొద్ది రోజుల పాటు ప్రత్యేక పాఠశాలను నిర్వహించారు. 'పరాశర' స్వచ్ఛంద సంస్థ ద్వారా అనాథ బాలల వసతి గృహాలు, వయోధికుల ఆశ్రమాలకు బియ్యం, పప్పు వంటి నిత్యావసరాలతో పాటు ఆర్థిక సహాయం అందించారు. సెక్రటరీ 50ఏళ్ల వేడుకలో పది మంది విద్యార్థులకు ఆర్థిక సహకారం ద్వారా చేయూత అందించారు. 2018, మే 21న అమెరికా లోని కాలిఫోర్నియాలో తన కూతురు నివాసంలో గుండె పోటుతో గుండెపోటుతో మృతిచెందారు.

## జనగామ జిల్లా లో ఘనంగా ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు






తొలిఅడుగు, జనగామ, మే20 : జనగామ జిల్లా అధ్యక్షులు కే శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు చాలా ఘనంగా జరిగాయి అనంతరం వారు మాట్లాడుతూ ఈ రోజు రాజరాజేశ్వరి వృద్ధుల అనాధ ఆశ్రమం లో కేక్ కట్ చేసి పండ్ల పంపిణి కార్యక్రమం చేయడం జరిగింది ప్రతి సంవత్సరం ఎన్టీఆర్ అన్న పుట్టినరోజు సందర్భంగా అనేక కార్యక్రమాలు చేయడం జరుగుతుంది ఎన్టీఆర్ అన్న ఇంకా పెద్ద పెద్ద సినిమాలు తీయాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వంచి హరీష్, నవీన్ అభిమానులు పాల్గొన్నారు..

## షాద్ నగర్ లో సునామి సృష్టించిన జూనియర్ ఎన్టీఆర్ జన్మ దిన వేడుకలు..

- ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో..
- ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మ దిన సంబురాలు..
- జై ఎన్టీఆర్ అంటూ సాయిబాబా థియేటర్లో అభిమానుల అంబరానంటిన సంబరాలు..
- హ్యాపీ బర్త్డే ఎన్టీఆర్ అంటూ అభిమానుల కేకలతో ఓరెత్తిన సాయిబాబా థియేటర్..





తొలి అడుగు, షాద్ నగర్, మే 20 : షాద్ నగర్ పట్టణం లో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మ దిన వేడుకలు నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా షాద్ నగర్ పట్టణం లోని సాయి బాబా థియేటర్లో యమదొంగ సినిమా సెకండ్ షో రిలీజ్ చేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు థియేటర్ ముందు కాసేపు సందడి చేశారు.బ్యాండ్ మేళాలతో.. బాణాసంచా కాల్చి చిందులు వేశారు. అనంతరం బర్త్ డే కేక్?ను కట్ చేసి.. జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు..జై ఎన్టీఆర్ అంటూ సాయిబాబా థియేటర్లో అభిమానుల సంబరాలు అంబరాన్ని తాకాయి. హ్యాపీ బర్త్డే మై డియర్ బాస్ ఎన్టీఆర్ అంటూ అభిమానుల కేకలతో ఓరెత్తిన షాదనగర్ పట్టణం.. ఈ కార్యక్రమం లో పాలకొండ రజిని కాంత్, అందె జంగరాజ్, ఇస్నాతి సత్యం, బాలరాజ్, బూర్గుల రమేష్,బబ్లు, నర్సింగ్ రావు, విజయ్, హరీష్, సురేష్, రామస్వామి, సి హెచ్. కుమార్, శంకర్ రాథోడ్, సాయి శ్రీకృష్ణ, శ్రీకాంత్, సలీమ్, వేణు, చంద్రశేఖర్, చంటి, శ్రీకాంత్, సలీమ్, విగ్నేష్, మహేందర్, సుధాకర్, రాజ్, నర్సింహా, శంకర్, సాయి బాబా యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు..

## గురుకుల సమస్యల పై స్పందించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్.



తొలిఅడుగు, భద్రాద్రి కొత్తగూడెం, మే 20 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలో గల తెలంగాణ గురుకుల పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. ప్రధానంగా మంచినీటితో పాటు పలు సమస్యలను గుర్తించి వాటి పరిష్కార దిశగా సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. గురుకుల చుట్టు ప్రక్కల మునగ మొక్కలతో పాటు పలు మొక్కలు నాటాలి అని ఆదేశించారు. ఇంకుడుగుంతలను పరిశీలించి పలు ఇంకుడు గుంతలు నిర్మించాలి అని సూచించారు. సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసి,ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టి విద్యార్థులకు భద్రత పెంచాలి అని సూచించారు.పలు నిర్మాణాల కట్టాడాలు చేయాలి అని పాఠశాలల ప్రారంభ సమయానికి పనులు పూర్తి కావాలని ఐటీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు,వారి సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## బిజెపి నాయకులు కరెడ్ల నరేందర్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు..

తొలిఅడుగు, మే 20 : బిజెపి రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక శాఖ కొకన్వీనర్ కరెడ్ల నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి నరేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీలో అహర్నిశలు పనిచేస్తూ ప్రజల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న నీకు మరొక్కసారి పుట్టినరోజు శుభాకాంక్షలు ఈయొక్క కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్,మోహన్ సింగ్, అత్తాపురం మహేందర్ రెడ్డి,కుడుముల బాల్ రాజ్,గణేష్ తదితరులు ఉన్నారు..



## మహిళపై దురుసుగా ప్రవర్తించిన కేసులో ముద్దాయికి ఒక సంవత్సరం జైలు శిక్ష 500 రూపాయలు జరిమానా

తొలిఅడుగు, భద్రాచలం, మే 20 : జడ్జిమెంట్ లీగల్ న్యూస్ ఆన్ 20 5 2025 మహిళపై దురుసుగా ప్రవర్తించిన కేసులో ముద్దాయికి ఒక సంవత్సరం జైలు శిక్ష 500 రూపాయలు జరిమానా విధించినట్టు భద్రాచలం జుడీషియల్ కోర్టు తీర్పు ఇచ్చింది వివరాల్లోకి వెళితే ముదిగొండ రామకృష్ణ డాక్టర్ సూపర్డెంట్ ఏరియా హాస్పిటల్ భద్రాచలం వారు 27 4 2022న గర్భిణీ స్త్రీకి సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించు సందర్భంలో ముద్దాయి ఎం న్ ఓ గుర్రం లాల్ ఖాన్ సదరు అనస్థీషియా పేషంట్ మహిళపై అవమానకర రీతి ల ప్రవర్తించాడని భద్రాచలం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు చేసి చారి సీటు కోర్టులో దాఖలు చేసినారు ఆ కేసు నెంబర్ సిసి 308/2022 22 గా కేసు నడుస్తుంది ఆ కేసు కాస్త ఈరోజు జడ్జి వి శివ నాయక్ తీర్పుని ఇవ్వడం జరిగింది.

# జీవన శైలితో పొంచి ఉన్న ముప్పు..



తొలిఅడుగు, చెడు జీవనశైలి కారణంగా.. దేశంలో ఒక వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తోంది. దీనిని ఇప్పుడు ఆపకపోతే రానున్న రెండు దశాబ్దాలలో దేశ పౌరులలో మూడింట ఒక వంతు మంది ఈ వ్యాధికి బలైపోవచ్చు. ఇది కేవలం ఒక వ్యాధి మాత్రమే కాదు.. అనేక వ్యాధులకు తల్లి కూడా. నిపుణులు ఈ వ్యాధిని సునామీ లాంటిదని అభివర్ణించారు. ఈ వ్యాధిని ఇప్పుడే నియంత్రించకపోతే.. భవిష్యత్తులో దేశ ఆరోగ్య నిర్మాణం, ఆర్థిక ఉత్పాదకత తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరిస్తున్నారు. భారతదేశంలో ఒక వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తోంది. మారిన జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా.. పిల్లలు కూడా దీనికి బలైపోతున్నారు. ఈ వ్యాధి కారణంగా అనేక ఇతర తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ వ్యాధి సునామీగా మారి రాబోయే 25 సంవత్సరాలలో భారతదేశాన్ని తాకవచ్చు. భారతదేశంలో నివసిస్తున్న 35 శాతం కంటే ఎక్కువ మంది ఈ వ్యాధికి బలైపోయే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఏమిటి? ఇది ఎందుకు అంత వేగంగా వ్యాపిస్తోంది? ఈ వ్యాధి అనేక ఇతర వ్యాధులకు మూలకారణంగా చెప్పబడింది. ఈ వ్యాధి టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం, హార్మోన్ల రుగ్మతలు, పిల్లలను కనలేకపోవడం, కొన్ని క్యాన్సర్లు వంటి వ్యాధుల పెరుగుదలకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. ఈ వ్యాధి దేశంలో ఒక సంక్షోభంగా మారుతోంది. ఈ వ్యాధికి ప్రధాన కారణం చెడు జీవనశైలి, మారిన దినచర్య, ఆహారపు అలవాట్లు. ఈ వ్యాధి పిల్లలను కూడా ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధిని స్థూలకాయం అంటారు. ది లాన్సెట్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. 2050 నాటికి భారతదేశ జనాభాలో దాదాపు మూడింట ఒక వంతు మంది లేదా 449 మిలియన్ల మంది ఊబకాయంతో బాధపడే అవకాశం ఉంది. ఎ××మీ లోని మెడిసిన్ విభాగంలో అదనపు ప్రొఫెసర్ డాక్టర్ నీరజ్ నిశ్చల్ ప్రకారం 20 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారిలో అంటువ్యాధులు కాని వ్యాధుల పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. దీనికి ప్రధాన కారణం స్థూలకాయం. అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు.. డీన్ డాక్టర్ రాజేష్ ఉపాధ్యాయ్ ప్రకారం ఊబకాయ సమస్యని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఇది దేశ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, ఆర్థిక ఉత్పాదకతపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. అంటువ్యాధిలా పెరుగుతున్న ఈ ఊబకాయం వ్యాధిని ఆపడానికి పెద్ద ఎత్తున ప్రణాలికలను రచించాలి.. ఊబకాయం గురించి ప్రజలను అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. ఈ వ్యాధి జీవనశైలికి నేరుగా సంబంధించినది. చిన్న వయసులోనే పిల్లలు దీని బాధితులుగా మారుతున్నారు. దీనిని నివారించడానికి, పాఠశాలల నుండే అవగాహన కల్పించడానికి ప్రయత్నాలు జరగాలి. పిల్లలకు ఏది మంచిదో, ఏది చెడ్డదో వారి ఆరోగ్యానికి చెప్పాలి. ఇది మాత్రమే కాదు ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాల్సిన అవసరం కూడా ఉంది. ఇప్పటి నుండే దీని కోసం ప్రయత్నాలు చేయకపోతే, రెండు దశాబ్దాల తర్వాత దేశ ఆరోగ్యం పూర్తిగా క్షీణించవచ్చు.

# ఆరోగ్యానికి సహజ సంజీవని..



తొలిఅడుగు, 'సుగంధ ద్రవ్యాల రాణి'గా పిలవబడే ఏలకులు కేవలం వంటకాలకు రుచిని జోడించడమే కాకుండా, ఆరోగ్యానికి అమృతంలా పనిచేస్తాయి. పురాతన కాలం నుండి సాంప్రదాయ వైద్యంలో ఉపయోగించబడుతున్న ఈ సుగంధ ద్రవ్యం, టీ రూపంలో తీసుకుంటే శరీరాన్ని శుద్ధి చేసి, నోటి ఆరోగ్యం నుండి గుండె, కాలేయం వరకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఏలకుల టీ తయారీ విధానం, దాని అద్భుతమైన ఆరోగ్య లాభాలను తెలుసుకుని, మీ రోజువారీ జీవనంలో ఈ సహజ సంజీవనిని చేర్చుకోండి. యాలకులను 'సుగంధ ద్రవ్యాల రాణి'గా పిలుస్తారు. ఇది భారతదేశం, శ్రీలంక మధ్య అమెరికాలో ఎక్కువగా సాగు చేస్తుంటారు. పురాతన కాలం నుండి వంట సాంప్రదాయ వైద్యంలో దీనిని ఉపయోగిస్తున్నారు. ఇది దాల్చిన చెక్క, జాజికాయ, లవంగాలు అల్లం వంటి వేడిని కలిగించే లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తీపి రుచికరమైన వంటకాలకు రుచిని జోడిస్తుంది. అంతేకాదు ఈ కింది ప్రయోజనాలను కూడా చేకూరుస్తుంది. ఏలకుల టీ నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది నోటి దుర్వాసనను తొలగించి, శ్వాసను తాజాగా, సుగంధంగా ఉంచుతుంది. యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలో బ్యాక్టీరియా వృద్ధిని అడ్డుకుంటాయి, దంతాలు, చిగుళ్ల సమస్యలను తగ్గిస్తాయి. ఈ టీ జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. అజీర్ణం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను తగ్గించి, ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. భోజనం తర్వాత ఒక కప్పు టీ తాగితే కడుపు తేలికగా అనిపిస్తుంది. ఏలకుల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రించి, కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఈ టీ శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్‌ను తొలగించి, కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచి, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. ఏలకుల టీ జీవక్రియను వేగవంతం చేసి, శరీరంలోని అదనపు కొవ్వును కరిగిస్తుంది, బరువు నియంత్రణకు సహాయపడుతుంది. అధిక పొటాషియం కంటెంట్ రక్తపోటును తగ్గించి, రక్తనాళాల ఒత్తిడిని నియంత్రిస్తుంది. రోజూ ఒక కప్పు టీ తాగడం హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఏలకుల టీ మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. ఒత్తిడి, ఆందోళనతో బాధపడేవారికి ఇది సహజ ఉపశమనం అందిస్తుంది. హార్మోన్ల సమతుల్యతను కాపాడి, మానసిక సంతోషాన్ని పెంచుతుంది. ఏలకులు వేడి స్వభావం కలిగి ఉంటాయి కాబట్టి, అతిగా తీసుకోవడం వల్ల అసౌకర్యం కలగవచ్చు. గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు వైద్య సలహా తీసుకోవాలి. అలెర్జీలు ఉన్నవారు తక్కువ మోతాదుతో ప్రారంభించి, శరీర స్పందనను పరిశీలించాలి.

# జుట్టు రాలడం ఆగాలంటే ఈ నీళ్లు తాగాల్సిందే..!



తొలిఅడుగు, ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా మెరిసే జుట్టు కావాలని ఉంటుంది. ఈ రోజుల్లో జుట్టు రాలడం, పెరగకపోవడం, బలహీనత వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సహజమైన మునగ ఆకుల నీరు బాగా ఉపయోగపడుతుంది. దీన్ని తాగడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. మునగ ఆకులు విటమిన్‌-ూ, జ, జు, దీ లను అందిస్తాయి. ఇందులో ఐరన్, జింక్, అమైనో ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి అన్ని కలిసి జుట్టు మూలాలను బలంగా మార్చడంలో సహాయపడతాయి. ఆకులలో ఉండే పోషకాలు జుట్టు ఎదుగుదలకు అవసరమైన సహజ మార్గం అందిస్తాయి. మునగ గింజలు కూడా శక్తివంతంగా పనిచేస్తాయి.మునగ ఆకుల నీటిని తాగడం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. తల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు బలంగా, మెత్తగా, ప్రకాశవంతంగా మారుతుంది. తలలో కొత్త జుట్టు మొదలవుతుంది. ఇది సాధారణంగా రసాయనాలు వాడకుండా చక్కగా పెరిగే సహజ మార్గం. గుప్పెడు తాజా మునగ ఆకులను తీసుకొని శుభ్రంగా కడగాలి. వీటిలో ఉండే మురికి తొలగించాలి. తరువాత రెండు కప్పుల నీటిని మరిగించాలి. నీరు మరిగిన తర్వాత అందులో ఆకులను వేసి 10 నిమిషాలు ఇంకా మరిగించాలి. తరువాత వడకట్టి నీరు చల్లార్చి తాగాలి. దీనిని ఖాళీ కడుపుతో తీసుకుంటే బాగా పని చేస్తుంది.మునగకాయలను చిన్న ముక్కలుగా రెండు కట్ చేసుకోవాలి. ఇప్పుడు రెండు కప్పుల నీటిని మరిగించి అందులో ఈ ముక్కలు వేసి 10 నిమిషాలు మరిగించాలి. తరువాత వడకట్టి చల్లబర్చాలి తాగాలి. ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి. ఒక కప్పుతో మొదలుపెట్టి, క్రమంగా రెండు కప్పుల వరకు తీసుకోవచ్చు. రుచి సరిగా అనిపించకపోతే తేనె లేదా నిమ్మరసం కొద్దిగా వేసుకోవచ్చు. దీన్ని వారంలో మూడుసార్లు తాగినా సరిపోతుంది. క్రమంగా రెండు నెలలు తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మునగ నీటిని తాగడమే కాకుండా.. తల కడుక్కోవడానికి కూడా వాడొచ్చు. తలపై ఈ నీటిని పోస్తే తల చర్మం చల్లగా ఉంటుంది. దీంతో తలలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. జుట్టు బలంగా మారుతుంది. మునగ నీటిలో విటమిన్ జ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలో ఉన్న విషాలను బయటకు పంపుతుంది. చర్మానికి మెరుపు తీసుకువస్తుంది. జుట్టు ఎదుగుదల క్రమంగా మెరుగవుతుంది.

# గుండె సంబంధిత సమస్యలకు ఇది మస్తు పనిచేస్తుందట..!



తొలిఅడుగు, మనలో చాలా మంది తినే ఆహారం ఆరోగ్యానికి మంచిదో కాదో ఆలోచించకుండా తింటున్నాం. ముఖ్యంగా కొలెస్ట్రాల్ సమస్య ఉన్న వాళ్లు తినే ప్రతిదీ శరీరం పై ప్రభావం చూపిస్తుంది. కొన్ని సహజ పదార్థాలు దీన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వాటిలో వెల్లుల్లి ఒకటి.ఆయుర్వేదం ప్రకారం వెల్లుల్లి శరీరాన్ని శుద్ధి చేస్తుంది. ఇది సహజ వైద్యంలో ముఖ్యమైనది. దీనిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు శరీరంలో బాగా పని చేస్తాయి. అల్లిసిన్, అజోయిన్, డయల్ సల్ఫైడ్ వంటి పదార్థాలు గుండె సంబంధిత సమస్యలు తగ్గించడంలో సహాయపడతాయి. రోజూ వెల్లుల్లిని తింటే కొలెస్ట్రాల్ స్థాయిలు బ్యాలెన్స్ గా ఉంటాయి. అనారోగ్యకరమైన ఆహారం, తక్కువ శారీరక చలనంతో ఈ రోజుల్లో జీవనశైలి మారిపోయింది. ఈ మార్పులు శరీరంలోని కొవ్వు పెరగడానికి కారణం అవుతున్నాయి. దాంతో పాటు గుండెపోటు, రక్తనాళాల్లో అడ్డంకులు, ఎక్కువ రక్తపోటు వంటి సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యలను తగ్గించడానికి సహజంగా దొరికే వాటిలో వెల్లుల్లి ముఖ్యమైనది. వెల్లుల్లిని పాలలో మరిగించి తింటే మంచి ఫలితం ఉంటుంది. పాలు వేడిగా ఉన్నప్పుడు దానిలో వెల్లుల్లి ముక్కలు వేసి కాసేపు మరిగించాలి. ఇలా తయారైన మిశ్రమం రాత్రి లేదా ఉదయం తినవచ్చు. ఇది శరీరంలో కొవ్వు తగ్గించడంలో సహాయపడుతుంది. కొలెస్ట్రాల్, బీపీ అదుపులో ఉండేలా చేస్తుంది. నెయ్యిలో వేయించి తీసుకోవడం.. ఇది పూర్వ కాలంలో ఎక్కువగా ఉపయోగించబడిన పద్ధతి. నెయ్యిలో వెల్లుల్లిని వేయించి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. వాసన కూడా తగ్గుతుంది. మీరు కూరల్లో వాడినా.. తినే ముందు ఒకటి రెండు ముక్కలు తీసుకున్నా మంచిదే. కొలెస్ట్రాల్ ఉన్నవారు నెయ్యి తీసుకోవాలంటే భయపడుతారు. కానీ నెయ్యిని చిన్న పరిమాణంలో వాడితే ఉపయోగమే ఉంటుంది. ఉదయం లేచిన వెంటనే ఒక వెల్లుల్లి రెబ్బను నానబెట్టిన గోరువెచ్చని నీటితో తినడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఇది జీర్ణక్రియ బాగా జరిగేందుకు సహాయపడుతుంది. శరీరం తేలికగా ఉండేలా చేస్తుంది. అయితే ఇది తిన్న తర్వాత కాసేపు నీళ్లు తాగకపోతే మంచిది. పుల్లటి సమస్య ఉంటే ఖాళీ కడుపుతో తినడం కంటే పాలలో మరిగించి తినడం మంచిది. ఎండాకాలంలో వెల్లుల్లి శరీరానికి వేడి చేస్తుంది. అందుకే తక్కువగా మాత్రమే తీసుకోవాలి. నెయ్యిలో వేయించిన వెల్లుల్లి తినడం వల్ల కొన్ని మందుల ప్రభావం మారే అవకాశం ఉంటే డాక్టర్‌ను అడగాలి. ఒకేసారి ఎక్కువగా తినవద్దు. తక్కువగా తినాలి. వెల్లుల్లి సహజంగా దొరికే మధురమైన ఔషధం. దీన్ని తినే విధానం శరీర పరిస్థితి, కాలం, అవసరాన్ని బట్టి మార్చాలి. పాలలో మరిగించినా, నెయ్యిలో వేయించినా, ఖాళీ కడుపుతో తిన్నా మోతాదు అనుసరించాలి.

# పైనాపిల్ తినొచ్చా?



తొలిఅడుగు, వేసవిలో చాలా మంది పండ్ల రసం తయారు చేసుకుని తాగుతుంటారు. కానీ ఈ సీజన్‌లో పైనాపిల్ జ్యూస్ తయారు చేసి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదా? కాదా? అని చాలా మంది ఆలోచిస్తుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం పైనాపిల్ మంచిదనే అంటున్నారు. రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వేసవిలో చాలా మంది పండ్ల రసం తయారు చేసుకుని తాగుతుంటారు. కానీ ఈ సీజన్‌లో పైనాపిల్ జ్యూస్ తయారు చేసి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదా? కాదా? అని చాలా మంది ఆలోచిస్తుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం పైనాపిల్ మంచిదనే అంటున్నారు. ఇందులో విటమిన్ సి, విటమిన్ బి6, మాంగనీస్, పొటాషియం, ఫోలేట్, ఫైబర్ వంటి ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై సానుకూల ప్రభావాలు ఉంటాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. పైనాపిల్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది తీవ్రమైన, ప్రాణాంతక గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. పైనాపిల్‌లో ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీవక్రియను మెరుగుపరుస్తాయి. దీని వినియోగం ఆకలిని తగ్గిస్తుంది. అజీర్ణంతో సహా అనేక కడుపు సంబంధిత సమస్యలను తొలగిస్తుంది. ఈ రోజుల్లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను అధికంగా ఉపయోగించే వారి సంఖ్య చాలా ఎక్కువ. దీని వాడకం వల్ల కంటి సమస్యలు కూడా వస్తున్నాయి. అందువల్ల కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పైనాపిల్ తినడం మంచిది. ఇందులో విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి. పైనాపిల్‌లో మాంగనీస్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అందువల్ల ఈ పండు తినడం వల్ల ఎముకలు బలపడతాయి.


తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక



# 'సూర్య 46' సినిమా షురూ

తొలిఅడుగు, విభిన్న చిత్రాలు, పాత్రలతో వివిధ భాషల ప్రేక్షకులకు చేరువయ్యారు తమిళ అగ్ర కథానాయకుడు సూర్య. (%ంబతీఝు%) తెలుగులోనూ ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ద్విభాషా చిత్రం కోసం ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరితో సూర్య చేతులు కలిపారు. కేవలం ప్రకటనతోనే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది సూర్య నటిస్తున్న 46వ చిత్రం. అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.33 గా తెరకెక్కనున్న ఈ చిత్రం.. సోమవారం హైదరాబాద్ లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ తరంలో అత్యంత ప్రతిభగల దర్శకులలో ఒకరిగా వెంకీ అట్లూరి పేరు తెచ్చుకున్నారు. భావోద్వేగ లోతును, వాణిజ్య విలువలను చక్కగా మిళితం చేసే కథకులలో వెంకీ అట్లూరి ఒకరు. సార్/వాతి, లక్కీ భాస్కర్ వంటి అద్భుతమైన సినిమాలతో వరుస ఘన విజయాలను సొంతం చేసుకొని ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు మరో అద్భుతమైన కథతో అలరించడానికి సూర్యతో చేతులు కలిపారు. ప్రేమలు చిత్రంతో యువతకు చేరువైన యువ సంచలనం మమిత బైజు కథానాయికగా నటిస్తుండటం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ అని చెప్పవచ్చు. ఈ చిత్రంతో రవీనా టాండన్ తెలుగు సినిమాల్లోకి పునఃప్రవేశం చేస్తున్నారు. సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల సార్, లక్కీ భాస్కర్, అమరన్, వీర ధీర సూరన్ చిత్రాలకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించి విలక్షణమైన సంగీత దర్శకుడిగా తనదైన ముద్ర వేశారు జి.వి. ప్రకాష్ కుమార్. ఇప్పుడు వెంకీ అట్లూరితో మరోసారి కలిసి పనిచేస్తున్నారు.

# మణిరత్నం కోసం ప్రశాంత్ నీల్ కాంప్రోమైజ్ ?



తొలిఅడుగు, జూనియర్ ఎన్టీఆర్ తో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న డ్రాగన్ (ప్రచారంలో ఉన్న టైటిల్) లో హీరోయిన్ గా రుక్మిణి వసంత్ ని ఎంచుకున్నప్పుడు ఆమె ఏడాది పాటు ఏ ఇతర సినిమాలో నటించకూడదనే కండీషన్ పెట్టినట్టు గత ఏడాదే వార్తలు వచ్చాయి. దానికి తగ్గట్టే రుక్మిణి ఆల్రెడీ షూటింగ్ లో ఉన్నవి కాకుండా కొత్తగా ఒప్పుకున్న కమిట్ మెంట్లు కనిపించలేదు. ఇది రాజమౌళి ఫార్ములా. తన హీరో హీరోయిన్లను పక్కా కండీషన్లతో లాక్ చేసుకోవడం నిన్న ఆర్ఆర్ఆర్ దాకా చేస్తూనే వచ్చారు. నీల్ కూడా అదే పాటించారు అనుకున్నారు. కానీ మణిరత్నం కోసం ఈ నిబంధనని నీల్ పక్కనపెట్టారని లేటెస్ట్ టాక్. దగ్ లైఫ్ తర్వాత మణిరత్నం ఒక రొమాంటిక్ ఎంటర్ టైనర్ ప్లాన్ చేసుకున్నారట. దానికి హీరోగా నవీన్ పోలిశెట్టిని ఎంచుకున్నట్టు కాస్త గట్టిగానే వినిపిస్తోంది. అధికారిక ధృవీకరణ లేదు కానీ ప్రాజెక్టు లాకైపోయిందని వినిపిస్తోంది. హీరోయిన్ గా రుక్మిణి వసంత్ ని తీసుకున్నారట. అదే నిజమైతే ప్రశాంత్ నీల్ రాజీ పడినట్టే అనుకోవాలి. ప్రస్తుతం సితార బ్యానర్ లో అనగనగా ఒక రాజు చేస్తున్న నవీన్ ఒక టైంలో ఒక సినిమాని మాత్రమే సెట్స్ పై ఉంచుతున్నాడు. దీని తర్వాత ఏదనే క్లారిటీ ఇప్పటిదాకా లేదు. చూస్తుంటే ఫైనల్ గా మణిరత్నం లాంటి కల్ట్ డైరెక్టర్ లో పడటం ఖాయంగానే కనిపిస్తోంది. వినడానికి బాగానే ఉంది కానీ ట్రెండ్ కి కాస్త దూరంగా వెళ్తున్న మణిరత్నం నవీన్ పోలిశెట్టి మీద ఎలాంటి సబ్జెక్టు రాసుకుని ఉంటారనేది ఆసక్తికరంగా మారింది. తనలో కామెడీ టైమింగ్ వాడుకునే హాస్యం మణిరత్నం రాయలేరు.






# త్రివిక్రమ్ మల్టీస్టారర్..?

తొలిఅడుగు, 'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసేది అల్లు అర్జున్ సినిమానే అని అంతా అనుకున్నారు. కెరీర్లో తొలిసారిగా ఒక భారీ ఈవెంట్ ఫిలిం, అది కూడా పాన్ ఇండియా స్థాయిలో చేయడానికి త్రివిక్రమ్ సన్నాహాలు చేసుకున్నాడు. ఇది ఇండియన్ ఫిలిం హిస్టరీలోనే బిగ్గెస్ట్ ఫిలిమ్స్‌లో ఒకటి అవుతుందని వార్తలు వచ్చాయి. కానీ తీరా చూస్తే.. అల్లు అర్జున్ 'పుష్ప-2' తర్వాత ఈ సినిమాను పట్టాలెక్కించకుండా అట్లీ సినిమాను మొదలుపెట్టేస్తున్నాడు. అలా అని త్రివిక్రమ్ సినిమా ఆగిపోయినట్లేమీ కాదు. అట్లీ సినిమా తర్వాత బన్నీ కచ్చితంగా ఈ సినిమా చేస్తాడనే అంటున్నారు. ఈ లోపు త్రివిక్రమ్ తక్కువ టైంలో ఒక సినిమా చేసేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు ఇటీవల జోరుగా వార్తలు వస్తున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి చర్చల్లో ఉన్న విక్టరీ వెంకటేష్ సినిమాను త్రివిక్రమ్ టేకప్ చేస్తున్నట్లు తెలుస్తోంది. త్రివిక్రమ్ రచనలో వెంకీ చేసిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి ఎంతగా ప్రేక్షకులను అలరించాయో తెలిసిందే. త్రివిక్రమ్ దర్శకత్వంలోనూ వెంకీ నటించడానికి అమితాసక్తి చూపించాడు కానీ.. చర్చల దశను దాటి ఆ సినిమా ముందుకు వెళ్లలేదు. ఐతే ఈ ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్ బస్టర్ కొట్టిన వెంకీ.. తర్వాత ఏ కొత్త సినిమాను మొదలుపెట్టలేదు. వేరే ప్రాజెక్ట్ అనుకున్నప్పటికీ.. త్రివిక్రమ్ అందుబాటులోకి రావడంతో ఆ సినిమానే చేయడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ-త్రివిక్రమ్ కాంబినేషన్ అనగానే తెలుగు ప్రేక్షకుల్లో ఎక్కడ లేని ఉత్సాహం వస్తోంది. వీరి కలయికలో సూపర్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ వస్తుందని ఆశిస్తున్నారు. ఐతే దీనికే ఎగ్జైట్ అవుతుంటే.. ఈ చిత్రంలో రామ్ చరణ్ కూడా నటిస్తాడనే రూమర్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నిజంగా ఈ కాంబో వర్కవుట్ అయితే అదిరిపోతుంది. కానీ ఓవైపు 'పెద్ది'తో ఫుల్ బిజీగా ఉంటూ.. ఇంకోవైపు సుకుమార్ సినిమాను కూడా చేయాల్సిన చరణ్.. మధ్యలో ఖాళీ చేసుకుని త్రివిక్రమ్-వెంకీ సినిమాలో నటిస్తాడా అన్నది ప్రశ్న.

# ఆ విషయాన్ని ఇంకా మర్చిపోలేక పోతున్నానంటున్న కియారా



తొలిఅడుగు, ఇంకా మర్చిపోలేకపోతున్నానంటూ కియారా పోస్టు పెడితే.. సేమ్ టు సేమ్ మా పరిస్థితి కూడా అలాగే ఉందని రిప్లైలు ఇచ్చేస్తున్నారు నెటిజన్లు. ఇంతకీ కియారా ఏ విషయాన్ని గుర్తుచేసుకుంటున్నట్టు... జనాలు దేనికి జేజేలు కొడుతున్నట్టు చూసేద్దాం పదండి.. జరగండి జరగండి అని కియారా డైరక్ట్ గా అనలేదు కానీ, మెట్ గాలాలో పరిస్థితి మాత్రం యాజ్ ఇట్ ఈజ్‌గా అలాగే అనిపించింది. జరగండి జరగండి అని కియారా డైరక్ట్ గా అనలేదు కానీ, మెట్ గాలాలో పరిస్థితి మాత్రం యాజ్ ఇట్ ఈజ్‌గా అలాగే అనిపించింది. మెట్ గాలా స్టెప్స్ మీద కియారా యమా స్టైలిష్‌గా ఇచ్చిన ఫోజుల్ని మర్చిపోలేకపోతున్నారు జనాలు. నేను కూడా యాజ్ ఇట్ ఈజ్ సిట్చువేషన్‌లోనే ఉన్నా. మీ ప్రేమాభిమానాల్లో మునిగి ఇంకా తేలడం లేదంటూ మెట్‌గాలా ఈవెంట్‌ని గుర్తుచేసుకున్నారు కియారా. ఈ ఏడాది గేమ్ చేంజర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ లేడీ ఆగస్టులో వార్2లో పలకరించడానికి రెడీ అవుతున్నారు. బేబీ బంప్‌తో దీపిక కల్కి ప్రమోషన్లలో పాల్గొన్నట్టు, కియారా వార్2 ప్రమోషన్లకు హాజరయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఓ వైపు సినిమాలు, మరోవైపు ప్రెగ్నెన్సీని పర్ఫెక్ట్ గానే ప్లాన్ చేసుకున్నారు కియారా. ఈ ఏడాది ఒకటికి రెండు రిలీజులున్నాయి. వచ్చే ఏడాది ఎలాగూ టాక్సిక్ ప్రేక్షకులను పలకరిస్తుంది. 2027కి ఆఫ్టర్ డెలివరీ ఫిట్‌గా తయారయ్యి ఏదో ఒక సినిమా చేసేయొచ్చు. ప్రెగ్నెంట్ అయినా.. కెరీర్ పరంగా గ్యాప్ రాకుండా బాగానే జాగ్రత్త పడ్డారు ఈ లేడీ అని మెచ్చుకుంటున్నారు జనాలు.

# అంపైర్‌తో ఫైటింగ్‌కి దిగిన లక్నో కెప్టెన్!



తొలిఅడుగు,: ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ వ్యూహపరమైన తప్పులతో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ా=ఎతో కీలక మ్యాచ్‌లో తను మూడవ స్థానంలో బ్యాటింగ్‌కు దిగడం, తప్పుడు ఐ=ా కోరడం ా్+ కు దెబ్బతీశాయి. ఈ చర్యలతో జట్టు పరాజయాన్ని చవిచూసింది. దీంతో పంత్ నాయకత్వంపై సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు, రిషబ్ పంత్ తనను తాను మూడవ స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం, అనంతరం విలువైన ఐ=ా ను వృథా చేయడం వంటి నిర్ణయాలు, ా్+ ప్లేఆఫ్ ఆశలపై నీరు పోశాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ అనేక తప్పులతో జట్టును కష్టాల్లోకి నెట్టుతున్నాడు. ా=ఎ (సన్‌రైజర్స్ హైదరాబాద్)తో ఎకానా స్టేడియంలో జరిగిన కీలకమైన మ్యాచ్‌లో రిషబ్ పంత్ ఆడిన పాత్ర తీవ్ర విమర్శలకు గురవుతోంది. ముఖ్యంగా టోర్నమెంట్‌లో తమ ప్లేఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకోవాల్సిన ఈ మ్యాచ్‌లో, పంత్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు జట్టుకి చేటు చేసాయి. మొదటి ఇన్నింగ్స్‌లో మంచి ఆరంభం లభించిన సమయంలో, పంత్ తనను తాను మూడవ స్థానంలో బ్యాటింగ్‌కి పంపించుకున్నాడు. అయితే, అతని ప్రదర్శన అత్యంత నిరాశజనకంగా నిలిచింది. దీంతో జట్టు వెనుకబడింది. అతని నిర్ణయం జట్టు కోసం మంచిదే అని అనుకునే ముందు, మరొక కీలక దశలో మరో తప్పిదం వెలుగులోకి వచ్చింది, అదే తప్పుడు ఐ=ా (డిసిషన్ రివ్యూల్ సిస్టం) తీసుకోవడం. మూడో ఓవర్‌లో జరిగిన సంఘటనలో, ఇషాన్ కిషన్ ఎదుర్కొన్న షార్ట్ బాల్ లెగ్ సైడ్‌కు వెళ్లింది. ఇషాన్ దానిని టక్ చేయడానికి ప్రయత్నించగా, బంతి పక్కకు వెళ్లిపోయింది. కిషన్ వెంటనే అది వైడ్ బాల్ అని అంపైర్‌ని ఆశించాడు. కానీ అంపైర్ స్పందించలేదు. ఇంతలో, రిషబ్ పంత్ అటు బౌలర్ల ఒత్తిడి, ఇటు క్యాచ్ ఆవకాశం అన్న ఊహతో వెంటనే ఐ=ా కోరాడు. అయితే అది కచ్చితంగా బంతి బ్యాట్‌కు తగలలేదని రీప్లేలో తేలింది. ఫలితంగా ఐ=ా వృథా అయింది. ఈ నిర్ణయం ఎప్పటికీ మారదనీ తెలిసినప్పటికీ, పంత్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగిన తీరు అభిమానుల్లో అసంతృప్తిని రేకెత్తించింది. ఇది కేవలం ఒక వైడ్ బాల్ మాత్రమేనని స్పష్టంగా తెలినా, పంత్ పట్టుబట్టి ఐ=ా తీసుకోవడం అతని ఆలోచనా విధానంపై అనుమానాలు కలిగిస్తోంది. ఇదే తప్పుడు నిర్ణయం కారణంగా ా్+తాము ఉన్న ఒక ఐ=ా ను కోల్పోయింది. రిషబ్ పంత్ కెప్టెన్‌గా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా అతని నిర్ణయాలపై విమర్శలు రావడమే కాకుండా, ఆటలో వ్యూహాత్మక లోపాలు జట్టుపై ప్రభావం చూపుతున్నాయి. ఇషాన్ కిషన్ తర్వాత ఆ వికెట్‌ను కోల్పోకుండా, అభిషేక్ శర్మతో కలిసి రెండో వికెట్‌కు మంచి భాగస్వామ్యాన్ని నిర్మించాడు. ఈ జోడీ 206 పరుగుల లక్ష్య ఛేదనలో ా=ఎ కు మంచోయ్ పాత్ర పోషించింది. మరోవైపు, రిషబ్ పంత్ తనను తాను మూడవ స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం, అనంతరం విలువైన ఐ=ా ను వృథా చేయడం వంటి నిర్ణయాలు, ా్+ ప్లేఆఫ్ ఆశలపై నీరు పోశాయి. టోర్నమెంట్ చివరి దశకు చేరుకునే సమయంలో ఇటువంటి వ్యూహపరమైన తప్పులు జట్టు భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చు. ఈ నేపథ్యంలో రిషబ్ పంత్ కెప్టెన్సీపై కొత్తగా చర్చలు మొదలవుతున్నాయి.

# కాసుల వర్షం కురిపిస్తే.. ఫ్రాంచైజీని కన్నీళ్లు పెట్టించిన ఘనుడు



తొలిఅడుగు,: 11 ఇన్నింగ్స్‌లలో 135 పరుగులు చేయడం గమనించదగ్గ విషయం. అందులో అతని సగటు 12.27గా ఉంది. అలాగే, స్ట్రైక్ రేట్ 100గా మారింది. ఈ పేలవ ప్రదర్శనను బట్టి చూస్తే, వచ్చే ఏడాది కూడా ా్+ అతన్ని నిలుపుకునే అవకాశం తక్కువగా ఉంటుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు ఒక పీడకల లాంటిది. అతను బ్యాట్స్‌మన్‌గా, కెప్టెన్‌గా ఘోరంగా విఫలమయ్యాడు. ఐపీఎల్ మెగా వేలం చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన ఈ ఆటగాడి పేలవ ప్రదర్శన అందరినీ నిరాశపరిచింది. తన బ్యాటింగ్ కారణంగా, రిషబ్ పంత్ లక్నోకి అతిపెద్ద స్కామ్ అని నిరూపించుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఉత్సాహం ముగియడానికి మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. సీజన్ ఫైనల్ జూన్ 3న జరుగుతుంది. కానీ, ఇప్పటి వరకు లక్నో సూపర్ జెయింట్స్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ తన బ్యాట్‌తో మ్యాజిక్‌ను చూపించలేకపోయాడు. అతను తన చివరి 12 మ్యాచ్‌ల్లో 11 ఇన్నింగ్స్‌లలో ఒకే ఒక అర్ధ సెంచరీ మాత్రమే సాధించాడు. ఇది కాకుండా, అతను రెండు మ్యాచ్‌ల్లో ఖాతా తెరవకుండానే తన వికెట్ కోల్పోయాడు. ఈ ప్రదర్శనతో, అతను రూ. 27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన తర్వాత అంచనాలను అందుకోలేకపోయాడు. సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రిషబ్ పంత్ బ్యాట్ మౌనంగా ఉంది. రిషబ్ పంత్ తన ధరను సమర్థించుకోవడంలో విఫలమయ్యాడు. వరుసగా పరాజయాల కారణంగా, రిషబ్ పంత్ విమర్శలతోపాటు అనేక ప్రశ్నలను ఎదుర్కొంటున్నాడు. ఇప్పటివరకు చాలా మంది గొప్ప ఆటగాళ్ళు అతని ఫామ్‌పై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ 27 ఏళ్ల ఈ బ్యాట్స్‌మన్ గత సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఒక సంవత్సరం తర్వాత ా్+ లోకి తిరిగి వచ్చిన అతను 13 మ్యాచ్‌ల్లో 40.54 సగటుతో 445 పరుగులు చేయగలిగాడు. ఈ కాలంలో, రిషబ్ పంత్ కూడా 3 అర్ధ సెంచరీలు సాధించగలిగాడు. అతని ఆటతీరును చూసి ముగ్ధుడైన లక్నో యజమాని సనివ్ గోయెంకా ఐపీఎల్ 2025 మెగా వేలంలో అతనిని కొనుగోలు చేయడానికి రూ.27 కోట్లు ఖర్చు చేశాడు. అయితే, అతని ప్రదర్శన విఫలం కావడంతో పంత్ కొనుగోలు ఓ భారీ తప్పిదంలా మారింది. రిషబ్ పంత్ 11 ఇన్నింగ్స్‌లలో 135 పరుగులు చేయడం గమనించదగ్గ విషయం. అందులో అతని సగటు 12.27గా ఉంది. అలాగే, స్ట్రైక్ రేట్ 100గా మారింది. ఈ పేలవ ప్రదర్శనను బట్టి చూస్తే, వచ్చే ఏడాది కూడా ా్+ అతన్ని నిలుపుకునే అవకాశం తక్కువగా ఉంటుంది. దీనికి ముందు అతను ఢిల్లీ క్యాపిటల్స్‌లో భాగం అని తెలిసిందే. అతను ఎనిమిది సంవత్సరాలు ఈ ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహించాడు. లక్నోతో పాటు, ఢిల్లీకి కూడా కెప్టెన్‌గా వ్యవహరించాడు.

# అభిషేక్‌తో ఓవరాక్షన్.. దిగ్వేష్‌పై సస్పెన్షన్ వేటు..



తొలిఅడుగు,: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో ఆరంభం నుంచి లక్నో ఆటగాడు దిగ్వేష్ రాఠీ వివాదాలకు కేంద్రంగా ఉంటున్నాడు. వికెట్ తీసిన ప్రతీసారి అతను నోట్‌బుక్ స్టైల్‌లో సెలబ్రేషన్ చేసుకొని ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కి ఆగ్రహం తెప్పించాడు. ఎన్నిసార్లు ఫైన్ వేసిన అతడు తన తీరును మాత్రం మార్చుకోలేదు. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌తో అభిషేక్ శర్మ వికెట్ తీసిన దిగ్వేజ్ ఇంకాస్త మితిమీరి ప్రవర్తించాడు. దీంతో అతనిపై ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు పడింది. ఈ సీజన్‌తో ఆరంగేట్రం చేసిన 23 ఏళ్ల దిగ్వేష్.. సీజన్ ఆరంభం నుంచి ఏ ఆటగాడి వికెట్ తీసిన నోట్‌బుక్‌లో రాసుకుంటున్నట్లు సైగ చేస్తూ సెలబ్రేట్ చేసుకుంటున్నాడు. దీని కారణంగా దిగ్వేష్ ఐపిఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ని ఉల్లంఘించి చాలాసార్లు గవర్నింగ్ కౌన్సిల్ ఆగ్రహానికి గురయ్యాడు. దీంతో జరిమానాలతో గవర్నింగ్ కౌన్సిల్ మొట్టికాయలు వేసిన దిగ్వేష్ తీరులో మార్పు రాలేదు. తాజాగా సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ వికెట్ తీసిన దిగ్వేష్ సెలబ్రేషన్‌తో ఓవరాక్షన్ చేశాడు. చేతితో వెళ్లిపో అంటూ అభిషేక్‌కి సైగలు చేశాడు. అభిషేక్ కూడా అతని సహనాన్ని కోల్పోయి.. సీరియస్ అయ్యాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అంపైర్లు, తోటి క్రీడాకారులు సర్ది చెప్పడంతో ఇద్దరు వెనక్కి తగ్గారు. మ్యాచ్ అనంతరం అభిషేక్ మాట్లాడుతూ.. దిగ్వేష్‌తో మాట్లాడానని.. ప్రస్తుతం అంతా సద్దుమణిగి కూల్ అయిపోయాం అని చెప్పాడు. కానీ, నిబంధనలు ఉల్లంఘించినందుకు దిగ్వేష్‌పై ఒక మ్యాచ్ సస్పెన్షన్.. ప్రతి స్పందించినందుకు అభిషేక్‌కి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత, ఒక డీమెరిట్ పాయింట్ విధించారు.

# 2 ఏళ్ల తర్వాత భారత టీ20 జట్టులోకి డేంజరస్ డైనోసార్ రీఎంట్రీ?



తొలిఅడుగు,: గత కొంతకాలంగా కేఎల్ రాహుల్ ప్రదర్శన చాలా బాగుంది. ఈ కారణంగా, సెలక్షన్ కమిటీ మరోసారి అతని పేరును టీ20 జట్టుకు పరిగణించాలని యోచిస్తోంది. ఆగస్టు 26 నుంచి 31 వరకు బంగ్లాదేశ్‌తో భారత్ 3 ు20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఐపీఎల్ 2025 ఉత్కంఠగా మారింది. ఈ సీజన్‌లో చాలా మంది ఆటగాళ్ళు అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నారు. ఇందులో అనుభవజ్ఞుడైన కేఎల్ రాహుల్ పేరు కూడా ఉంది. ప్రస్తుత సీజన్‌లో, రాహుల్ తన జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌లో అత్యంత విజయవంతమైన బ్యాట్స్‌మన్‌గా మారాడు. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌పై అద్భుతమైన సెంచరీ సాధించి, 112 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. దీనికి ముందు కూడా కొన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ ప్రదర్శన చూసి, సెలెక్టర్లు రాహుల్‌కు భారత టీ20 జట్టులో మరోసారి అవకాశం ఇవ్వాలని ఆలోచిస్తున్నారు. ఆగస్టులో బంగ్లాదేశ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు రాహుల్ పేరును పరిశీలిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. కేఎల్ రాహుల్ ఒకప్పుడు మూడు ఫార్మాట్లలో భారత్ తరపున రెగ్యులర్ ఆటగాడిగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే, 2022 సంవత్సరంలో జరిగిన టీ20 ప్రపంచ కప్ నుంచి, రాహుల్‌కు సెలెక్టర్లు పొట్టి ఫార్మాట్‌లో అవకాశం ఇవ్వలేదు. రెండున్నర సంవత్సరాల తర్వాత, అతను ఇప్పుడు తిరిగి రావచ్చు అని తెలుస్తోంది. రాహుల్ తన చివరి టీ20ఊ మ్యాచ్‌ను ఇంగ్లాండ్‌తో అడిలైడ్‌లో ఆడాడు. అది టీ20 ప్రపంచ కప్ సెమీ-ఫైనల్ మ్యాచ్. గత కొంతకాలంగా కేఎల్ రాహుల్ ప్రదర్శన చాలా బాగుంది. ఈ కారణంగా, సెలక్షన్ కమిటీ మరోసారి అతని పేరును టీ20 జట్టుకు పరిగణించాలని యోచిస్తోంది. ఆగస్టు 26 నుంచి 31 వరకు బంగ్లాదేశ్‌తో భారత్ 3 ు20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. రాహుల్ టీ20 అంతర్జాతీయ కెరీర్‌ను పరిశీలిస్తే, అతను 72 మ్యాచ్‌లు ఆడాడు. ఈ సమయంలో, అతను 68 ఇన్నింగ్స్‌లలో 37.75 సగటు, 139.12 స్ట్రైక్ రేట్‌తో 2265 పరుగులు చేశాడు. అతని బ్యాట్ నుంచి 2 సెంచరీలు, 22 అర్ధ సెంచరీలు కనిపించాయి. ఖూా 2025లో కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ప్రదర్శన గురించి మాట్లాడుకుంటే, అతను వేర్వేరు స్థానాల్లో బ్యాటింగ్ చేశాడు. అలాగే, అన్ని స్థానాల్లో రాణించాడు. రాహుల్ 11 మ్యాచ్‌ల్లో 11 ఇన్నింగ్స్‌ల్లో 61.62 సగటుతో 493 పరుగులు చేశాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 148.04 స్ట్రైక్ రేట్‌తో ఈ పరుగులు చేశాడు. ఈ కాలంలో, అతను ఒక సెంచరీ, 3 అర్ధ సెంచరీలు కూడా చేశాడు.

# పంజాబ్ కింగ్స్ అదరహో..



తొలిఅడుగు,:: ఐపిఎల్ సీజన్ 2025లో పంజాబ్ కింగ్స్ అసాధారణ ఆటతో ప్లేఆఫ్‌కు చేరుకుంది. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన పంజాబ్ అద్భుత ప్రదర్శనతో నాకౌట్‌కు దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లు ఆడిన పంజాబ్ 8 విజయాలు సాధించి సత్తా చాటింది. ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయ్యింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. బ్యాట్‌తో కూడా రాణిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. సీజన్ ఆరంభానికి ముందు పంజాబ్‌పై ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. ప్లేఆఫ్ బెర్త్ సంగతి అటుంచి కనీసం టాప్6లో నిలిచినా గొప్పే అంటూ విశ్లేషకులు సయితం అభిప్రాయపడ్డారు. కానీ ఈ సీజన్‌లో పంజాబ్ అసాధారణ రీతిలో రాణించింది. సమష్టిగా రాణిస్తూ ప్లేఆఫ్‌కు చేరుకుంది. జట్టు విజయాల్లో ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రియాంశ్ ఇప్పటికే సెంచరీతో ఆకట్టుకున్నాడు. ప్రభ్‌సిమ్రన్ కూడా నిలకడైనబ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలిచాడు. ఇద్దరు చాలా మ్యాచుల్లో జట్టుకు శుభారంభం అందించారు. నెహాల్ వధేరా, శశాంక్ సింగ్ తదితరులు కూడా తమవంతు సహకారం అందించారు. వీరు కూడా నిలకడగా బ్యాటింగ్ చేస్తూ తమవంతు పాత్ర పోషించారు. అయితే జట్టు ఈ స్థాయిలో ఉందంటే మాత్రం దానికి ప్రధాన కారణం శ్రేయస్ అయ్యర్ అద్భుత కెప్టెన్సీనే అనడంలో ఎలాంటి సందేహం లేదు. జట్టుపై శ్రేయస్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. సందర్భోచితంగా నిర్ణయాలు తీసుకుంటూ జట్టును ముందుకు తీసుకెళుతున్నాడు. సహచరుల్లో కొత్త జోష్‌ను నింపుతూ వారు మెరుగైన ఆట కనబరిచేలా చూస్తున్నాడు. దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ శ్రేయస్ బ్యాట్‌తోనూ సత్తా చాటాడు. కెప్టెన్సీతో పాటు బ్యాటింగ్‌లోనూ అతను రాణిస్తున్నాడు. ఇది పంజాబ్‌కు కలిసి వచ్చే అంశంగా మారింది. ప్రభ్‌సిమ్రన్ కూడా అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. ప్రియాంశ్ ఆర్యతో కలిసి పలు మ్యాచుల్లో జట్టుకు శుభారంభం అందించాడు. మిగిలిన మ్యాచుల్లోనూ సత్తా చాటేందుకు ఈ జోడీ సిద్ధంగా ఉంది. బౌలింగ్‌లో కూడా పంజాబ్ బలమైన శక్తిగా మారింది. హర్‌ప్రీత్ బ్రార్, యుజువేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, మార్కొ జాన్‌సెన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు జట్టులో ఉన్నారు. చాహల్, అర్ష్‌దీప్‌లు దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ మెరుగైన బౌలింగ్‌ను కనబరిచారు.